ఈనాడు
హైదరాబాద్
మంగళవారం 26 జూన్ 2012 24 పేజీలు 20 పేజీలు

# గుజరాతు గడ్డ... మన తెలుగు బిడ్డ!



● 'జెర్మి' డైరెక్టర్‌గా టి.హరినారాయణ విజయకేతనం

● చిన్ననాటి నుంచే ప్రయోగబాటలో పయనం

న్యూస్‌టుడే, హైదరాబాద్

చిన్నతనంలోనే రకరకాల ప్రయోగాలు చేశాడాయన. పెద్దయ్యాక ఊరుకుంటాడా? కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూనే ఉన్నాడు. ఆ తపనే ఆయనకు 'నేషనల్ మినరల్ అవార్డు' దక్కేలా చేసేంది. ఆయనే ఎన్‌జీఆర్‌ఐలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.హరి నారాయణ. ఆయన విశిష్ట సేవల్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం గుజరాత్ ఎనర్జీ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్(జెర్మి)కి డైరెక్టర్‌గా నియమించింది. నాటి నుంచి ఆయన ఎన్నో విజయాల్ని సాధించారు. దేశంలో 'జెర్మి' తరహా పరిశోధన సంస్థలు 40 వరకు ఉంటాయి. బయటి రాష్ట్రాల్లోని సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థల్లోని అత్యున్నత పదవిలో నియమితులైన తొలి తెలుగు వ్యక్తి హరినారాయణ కావడం విశేషం. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆయనతో 'న్యూస్‌టుడే' ముచ్చటించింది. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

తిరుపతిలో పుట్టి పెరిగిన నేను బీఎస్సీ వరకు అక్కడే చదివా. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జియోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేశా. తర్వాత ధన్‌బాద్‌లో ఎలక్ట్రోమాగ్నటిక్స్‌తో పీహెచ్‌డీ పూర్తయింది. మరో పీహెచ్‌డీ ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి చేశా. పరిశోధనలపై మొదటి నుంచి ఆసక్తి. చిన్నతనంలో ఉన్న ఆసక్తి వయసుతో పాటూ పెరిగింది. ఉప్పల్‌లోని నేషనల్ జియోగ్రాఫికల్ పరిశోధక కేంద్రంలో 33 ఏళ్ల క్రితం చేరా.

● పరిశోధనల్లో మునిగిపోయిన నాకు పదోన్నతుల రూపంలో ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు ప్రోత్సాహం లభించింది. 80లలో ఎస్ఎస్‌ఏగా చేరిన నేను 'బి'తో మొదలుపెట్టి ప్రస్తుతం 'జి' శాస్త్రవేత్త హోదాలో ఉన్నా. కామన్వెల్త్ ఫెలోగా, యూనివర్సిటీ ఆఫ్ టోక్యోలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో విజిటింగ్ శాస్త్రవేత్తగా వేర్వేరు దేశాలు చుట్టివచ్చా. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక 'నేషనల్ మినరల్ అవార్డు'ను 45 ఏళ్ల వయసులో అందుకోవడం మర్చిపోలేని అనుభూతి. పదవీ విరమణ సమయంలో కానీ ఆ పురస్కారం దక్కేది కాదు. ఆ పరంపరకు నాతో అడ్డుకట్ట పడింది. ఆ తర్వాత వరించిన 'ఆంధ్రప్రదేశ్ సైంటిస్ట్ అవార్డు' మర్చిపోలేనిది.

● తొలిసారిగా మనదేశంలో మెరైన్ అండ్ ఎలక్ట్రో మాగ్నటిక్స్(ఎంఎంటీ) పరికరం రూపొందించి సముద్రంలోని పొరలను కనుక్కోగలిగా. భూమి నుంచి ఆయస్కాంత శక్తి వెలువడుతూ ఉంటుంది. అది తరచూ మారుతూ ఉంటుంది. దీనినే ఎలక్ట్రో మాగ్నటిక్ ఇండక్షన్ అంటాం. దీన్ని భూమిపై ఉంచి లోపల ఎంత మేర ఏయే పొరలు ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఇది ఎప్పటి నుంచో ఉన్నదే. సముద్రంలో మాత్రం ఇప్పటివరకు ఎవరూ చేయలేదు. తొలిసారిగా మా బృందం గుజరాత్‌లోని గల్ఫ్ ఆఫ్ కచ్‌లో చేసిన ప్రయోగం ఫలించింది. ఇక్కడ వాడేందుకు కావాల్సిన పరికరాలను వ్యక్తిగత పరిచయాలతో రష్యా నుంచి రప్పించాం. వాటి సహాయంతో నాలుగు కిలోమీటర్ల మేర సెడిమెంట్రీ రాక్ ఉన్నట్లు కనుగొన్నాం. ఆయిల్, గ్యాస్ ఉత్పత్తికి ఇది ఉపయోగపడుతుంది.

● గుజరాత్ ఎనర్జీ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్(జెర్మి)లో చేరాక చాలా మార్పులు తీసుకొచ్చానని చెప్పుకొనేందుకు గర్వపడుతున్నా. తొలిసారిగా ఇక్కడ విద్యార్థులు ప్రాజెక్టులు చేసుకునేందుకు అవకాశం కల్పించా. ఎన్‌జీఆర్‌ఐలో ఉన్నప్పుడు చాలామంది విద్యార్థులు వచ్చి సంప్రదిస్తుండేవారు. వారిలో ఉత్సాహం, కొత్తగా ఆలోచించే తీరు నన్ను ఈ దిశగా అడుగులు వేయించింది. 60 దరఖాస్తులు రాగా 10 మందికి అవకాశం కల్పించాం. వారికి వసతితో పాటూ ఉపకార వేతనం ఇచ్చేలా ఏర్పాటు చేశా. మొత్తం పది మంది విద్యార్థులు వేర్వేరు ప్రాంతాల్లోని ఐఐటీ విద్యార్థులే.

● ఒక్కో విద్యార్థి చేస్తున్న ప్రయోగాలు భవిష్యత్తులో మెరుగైన జీవనాన్ని గడపడానికి దోహదపడేవే. ప్రస్తుతం సవాళ్లు ఎదుర్కొంటున్న అంశాలనే వారు ప్రాజెక్టులుగా ఎంపిక చేసుకుని సాధ్యాసాధ్యాలపై నివేదికను సిద్ధం చేస్తున్నారు. అందులో ఒకటి పవన విద్యుత్తును నిల్వ చేయడం. సహజసిద్ధంగా లభిస్తున్న పవన విద్యుత్తును ఒత్తిడి ద్వారా సిలిండర్లలోకి పంపి, ఇంట్లో గ్యాస్ మాదిరి అవసరమైన సందర్భాల్లో వాడుకుంటే బాగుంటుంది. ప్రస్తుతం బ్యాటరీల ద్వారా విద్యుత్తును ఛార్జ్ చేస్తున్నా అంత ప్రభావవంతంగా లేదు. అదే కొత్త ఆలోచనలకు నాంది.

● పదవీ విరమణ చేసిన శాస్త్రవేత్తల సేవలను వినియోగించుకునేందుకు ప్రవేశపెట్టిన 'ఎమినెంట్ సైంటిస్ట్'కు విశేష స్పందన లభించింది. తమ మేధస్సు పరిశోధనలకు బాసటగా నిలిపేందుకు దేశ వ్యాప్తంగా ఎంతోమంది విశ్రాంత సైంటిస్టులు ముందుకు వచ్చారు.

● కేంద్ర ప్రభుత్వ విద్యార్థుల్లో శాస్త్ర పరిశోధనలపై ఆసక్తి నెలకొల్పేందుకు 'ఇన్‌స్పైర్' పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో ఇద్దరు ప్రొఫెసర్లు పాల్గొంటుండగా నేనూ ఒకర్ని. నా పేరున www.tharinarayana.netవెబ్‌సైట్ ఉంది. అందులో నా కెరీర్, సాధించిన పురోగతి, అవార్డులు, రివార్డులు, విదేశీ పర్యటనల వివరాలు ఉన్నాయి. పదేళ్ల క్రితం ఎన్‌జీఆర్‌ఐలోని నా విద్యార్థులు ఈ వెబ్‌సైట్ ప్రారంభించారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం మాది. భార్య ఇద్దరు పిల్లలు. అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ ఐఐటీల్లో చదువుకున్నారు.



● ఎలక్ట్రిక్ విద్యుత్తు నుంచి తిరిగి విద్యుత్తును పుట్టించడం మరో ప్రాజెక్టు. రైలు పెద్ద చక్రాలకు అనుసంధానంగా చిన్న చక్రాలను జోడించి డైనమోల సాయంతో విద్యుత్తు ఉత్పత్తి చేయగలిగితే రైలు పరిగెత్తేందుకు కావాల్సిన విద్యుత్తు వస్తుంది. ఇంట్లో తిరిగే ఫ్యాను.. ఇలా దేనికదే పుట్టించే ప్రాజెక్టును విద్యార్థులు చేస్తున్నారు. చౌకగా విద్యుత్తును ఉత్పత్తి చేసే వాటిపై విద్యార్థులు దృష్టి పెట్టేలా ప్రోత్సహిస్తున్నాం.